మన రాజధాని
రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
మంగళవారం 27 అక్టోబర్ 2026 పేజీలు : 4

పకడ్బందీగా మున్సిపల్ ఎన్నికలు

అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

ఎన్నికల పరిశీలకుడు కన్నబాబు

పల్నాడు జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బం దీ ఏర్పాట్లు చేయాలని జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ కన్నబాబు ఆదేశించారు. నాలుగు మున్సిపా లిటీల్లో 156 వార్డులకు సంబంధించి 117 పోలింగ్ లొకేషన్లలో 310 కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల్లో భద్రత పెంచాలని, వెబ్‌కాస్టింగ్ చేపట్టాలని సూచించారు.

నరసరావుపేట రక్షణ న్యూస్...

వివరాలు 2లో..

ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే మహిళ మృతి

వివరాలు 2లో..

నరసరావుపేట అంజిరెడ్డి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన 55 ఏళ్ల మహిళ ఇంజక్షన్ తీసుకున్న కొద్దిసేపటికే మృతి చెందడం కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుటుంబ సభ్యురాలి ప్రాణా లు తీసిందని ఆరోపించిన బంధువులు ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. మృతికి అసలు కారణాలను తేల్చాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నరసరావుపేట రక్షణ న్యూస్...

మూడు పీఠాలూ టీడీపీకేనా?

ఎడిటర్ నరేంద్ర

జడ్పీ చైర్మన్‌ల పై ఉమ్మడి జిల్లాలో ఆసక్తికరమైన చర్చ...

జనసేన సర్దుకు పోతుందా..



వివరాలు 2లో..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు జడ్పీ పీఠాలు.. కూటమిలో ఒకటే చర్చ! గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ప్రస్తుత రాజకీయ సమీకరణాలు టీడీపీకి అనుకూలంగా కనిపిస్తుండటంతో మూడు చైర్మన్ పదవులూ ఆ పార్టీ ఖాతాలోకే చేరతాయనే అంచనాలు ఊపందుకుంటున్నాయి. రిజర్వేషన్లు ఒకవైపు.. అధికార బలం మరోవైపు.. ఈ రెండింటి మధ్య జనసేనకు దక్కే వాటా ఎంతన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. మూడు పీఠాలనూ టీడీపీ ఆశిస్తే, జనసేన అధిష్ఠానం ఏం చేస్తుంది? కూటమి ధర్మం పేరుతో సర్దుకుపోతుందా? లేక రాజకీయ వాటా కోసం పట్టుబడుతుందా? ఈ పదవుల పంపకం రాబోయే రోజుల్లో కూటమి అంతర్గత సమీకరణాలకు కీలక పరీక్షగా మారనుంది.

అనుకున్నదొక్కటి. అయినదొక్కటి!

▶ చిలకలూరిపేటలో రజనీ వ్యూహం ఫెయిల్..

▶ చైర్‌పర్సన్ అభ్యర్థి టీడీపీలోకి

వివరాలు 2లో..

చిలకలూరిపేట మున్సిపల్ రాజకీయ చదరంగంలో పావులు కదుపుతున్నామనుకున్న వైసీపీ నేత విడదల రజనీకి తెలుగుదేశం పార్టీ ఊహించని మలుపుతో షాక్ ఇచ్చింది. ప్రత్యర్థి శిబిరానికి చెక్ పెట్టే ప్రయత్నంలో ఉండగానే, సొంత శిబిరంలోని కీలక అభ్యర్థే గోడ దూకడంతో రాజకీయ లెక్కలు తారుమారయ్యాయి. చైర్‌పర్సన్ పీఠంపై ఆశలు పెట్టుకున్న వైసీపీకి అభ్యర్థి మార్పు గట్టి దెబ్బగా మారగా, ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో షేక్ కరీమున్ టీడీపీలో చేరడం రజని వ్యూహాలకు ఎదురుదెబ్బగా చర్చకు దారితీసింది. రాజకీయ ఎత్తుగడల్లో పైచేయి సాధించామనుకున్న చోటే పట్టు కోల్పోవడంతో వైసీపీ శ్రేణుల్లో ఈ పరిణామం కలకలం రేపుతోంది.

శిలారు నరసరావుపేట రక్షణ ప్రతినిధి

బాపట్ల--విశాఖ మధ్య అర్నబ్ తీరం దాటే అవకాశం

రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి

గంటకు 125 కి.మీ. వేగంతో గాలులు.. గరిష్ఠంగా 140 కి.మీ.



వివరాలు 5లో..

బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరంవైపు దూసుకొస్తుండటంతో బాపట్ల జిల్లా తీర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 28న తీరాన్ని దాటే అవకాశం ఉందన్న అంచనాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. గంటకు 125 కి.మీ. వేగంతో గాలులు, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉండటంతో మత్స్యకారులు, తీర గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

బాపట్ల జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావం నేపథ్యంలో బాపట్ల జిల్లాలో విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తుఫాను కారణంగా భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. తుఫాను పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలు పాటించాలని కోరారు.

ఆర్నబ్ తో బాపట్ల బీచ్ క్లోజ్

తీర ప్రాంతాలకు వెళ్లొద్దు

మత్స్యకారులు వేటకు వెళ్లరాదు

అత్యవసర సాయం కోసం 112కు ఫోన్ చేయండి

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో బాపట్ల జిల్లాలోని బీచ్‌లను అక్టోబర్ 27 నుంచి తదుపరి ఆదేశాలు వెలువడే వరకు మూసివేస్తున్నట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ ప్రకటించారు. పర్యాటకులు, సందర్శకులు సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లరాదని స్పష్టం చేశారు.

రక్షణ న్యూస్ బాపట్ల..

వివరాలు 2లో..

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/26/2026 11:35 PM Page 2

అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి!

మొదటి పేజీ తరువాయి

రక్షణ న్యూస్ -- చిలకలూరిపేట:

చిలకలూరిపేట మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అనుకున్నదొక్కటి.. అయినదొక్కటిగా రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో మాజీ మంత్రి విడదల రజనీ రూపొందించిన వ్యూహానికి అనూహ్య ఎదురుదెబ్బ తగిలింది. చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలోకి దింపిన షేక్ కరీమున్ ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీలో చేరడంతో వైసీపీ శిబిరంలో కలకలం మొదలైంది. మరోవైపు 48 వార్డుల్లో 16 వార్డులు కూటమికి ఏకగ్రీవమైనట్లు సమాచారం వెలువడటంతో చిలకలూరిపేట రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి.ఎన్నికల వేళ అభ్యర్థులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన తరుణంలో, కీలకమైన చైర్‌పర్సన్ అభ్యర్థే పార్టీ మారడం వైసీపీకి ఇబ్బందికర పరిణామంగా మారింది. ప్రత్యర్థి శిబిరంలోకి వెళ్లి అక్కడి అభ్యర్థికి మద్దతు ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో స్థానిక ఎన్నికల్లో వైసీపీ నాయకత్వం అనుసరిస్తున్న వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికపై చర్చ మొదలైంది.ఆదివారం ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో షేక్ కరీమున్ తన భర్త యూసుఫ్ అలీతో కలిసి టీడీపీలో చేరారు. ప్రత్తిపాటి పుల్లారావు ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పట్టణ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిని చూసి టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు కరీమున్ తెలిపారు. చిలకలూరిపేట సమగ్ర అభివృద్ధి ప్రత్తిపాటి నాయకత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. కూటమి తరపున ప్రచారం చేస్తానని, జనసేన చైర్‌పర్సన్ అభ్యర్థి తోట రాజరాజేశ్వరికి మద్దతు ఇస్తానని ప్రకటించారు.మున్సిపాలిటీలో మొత్తం 48 వార్డులు ఉండగా, 16 వార్డులు కూటమికి ఏకగ్రీవమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ అభ్యర్థి పార్టీ మారడం కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. మిగిలిన వార్డుల్లో పోటీతో పాటు మున్సిపల్ పీఠంపై రాజకీయ ఆసక్తి మరింత పెరిగింది.కరీమున్ పార్టీ మార్పు వెనుక ఉన్న కారణాలపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. అయితే కీలక అభ్యర్థిని నిలబెట్టుకున్నామనే ధీమా వైసీపీకి లేకుండా పోవడం, ఆమె ప్రత్యర్థి కూటమికి మద్దతు ప్రకటించడం రజనీ రాజకీయ వ్యూహానికి ఎదురుదెబ్బగా కనిపిస్తోంది. ఈ పరిణామం ఓటర్లపై ఎంతవరకు ప్రభావం చూపుతుంది, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలకు దారితీస్తుంది అన్నది వేచి చూడాలి.

పకడ్బందీగా మున్సిపల్ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

నరసరావుపేట రక్షణ న్యూస్...

మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ కన్నబాబు ఆదేశించారు. ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం నరసరావుపేట కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలోని వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల మున్సిపాలిటీల్లో 156 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల తెలిపారు. 117 పోలింగ్ లొకేషన్లలోని 310 పోలింగ్ కేంద్రాల్లో 2,28,391 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. ఓటర్లకు ఫొటో ఓటరు స్లిప్పుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, ఆహారం, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అబ్జర్వర్ కన్నబాబు సూచించారు. ఎన్నికల సిబ్బంది కేటాయింపునకు సంబంధించి రెండు విడతల ర్యాండమైజేషన్ పూర్తయిందని, మూడో విడతను అక్టోబరు 30న నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ పత్రాల ముద్రణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సంబంధిత మున్సిపాలిటీల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కన్నబాబు సూచించారు. అవసరమైన చోట వెబ్‌కాస్టింగ్ నిర్వహించేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి మాట్లాడుతూ 117 పోలింగ్ లొకేషన్లలో 29 అత్యంత సున్నితమైనవి, 52 సున్నితమైనవి, 36 సాధారణమైనవిగా గుర్తించినట్లు వివరించారు. అత్యంత సున్నిత ప్రాంతాల్లో ఐదుగురు, సున్నిత ప్రాంతాల్లో నలుగురు, సాధారణ ప్రాంతాల్లో ఇద్దరు పోలీసు సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ఠ భద్రత కల్పిస్తామని వెల్లడించారు.సమీక్షలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, జిల్లా వ్యయ పరిశీలకుడు భరణి ఐఎఫ్ఎస్, జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి, జాయింట్ కలెక్టర్ సంజన సింహ తదితరులు పాల్గొన్నారు.

మూడు పీఠాలూ టీడీపీకేనా?

మొదటి పేజీ తరువాయి

ఎడిటర్ కాలం...

ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవుల చుట్టూ ఆసక్తికరమైన సమీకరణాలు కనిపిస్తున్నాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిశీలిస్తే మూడు జడ్పీ పీఠాలూ తెలుగుదేశం పార్టీ ఖాతాలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అంచనాలు వినిపిస్తున్నాయి. రిజర్వేషన్లు, స్థానిక రాజకీయ బలాబలాలు, అధికార కూటమిలో టీడీపీకి ఉన్న ప్రాధాన్యం ఈ అంచనాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. అయితే మూడు పీఠాలూ టీడీపీకే దక్కితే కూటమి భాగస్వామి జనసేన పరిస్థితి ఏమిటి? ఆ పార్టీ నాయకత్వం ఈ పరిణామాన్ని ఎలా తీసుకుంటుంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి గుంటూరు ప్రాంతం మూడు జిల్లాలుగా విడిపోయింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో జడ్పీ చైర్మన్ పదవులు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గుంటూరు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించగా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో జనరల్ మహిళలకు రిజర్వు చేశారు. ఈ కేటాయింపులు అభ్యర్థుల ఎంపికకు దిశానిర్దేశం చేస్తున్నాయి. మూడు జిల్లాల్లోనూ మహిళా అభ్యర్థుల ఎంపిక కీలకం కావడంతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.గుంటూరు జిల్లాలో ఎస్సీ మహిళా అభ్యర్థి ఎంపికపై టీడీపీ దృష్టి సారించాల్సి ఉంది. బాపట్లలో జనరల్ మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో పార్టీ తరపున పోటీకి ఆసక్తి చూపుతున్న నాయకుల కుటుంబాలు, స్థానిక రాజకీయ సమీకరణాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పల్నాడులోనూ జడ్పీ చైర్మన్ పదవిపై టీడీపీ ఆశలు పెట్టుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ మూడు జిల్లాల్లోనూ టీడీపీకి అనుకూలంగా కనిపిస్తున్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ఆ పార్టీ ఆశలకు బలాన్నిస్తున్నాయి. అయితే రిజర్వేషన్లు అనుకూలంగా ఉండటం ఒక అంశమైతే, జడ్పీటీసీ స్థానాల్లో గెలిచి అవసరమైన సభ్యుల బలాన్ని సాధించడం మరో అంశం.ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే ఈ మూడు పీఠాలపైనా టీడీపీ ఆధిపత్యం కొనసాగే అవకాశాలున్నాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న టీడీపీ స్థానిక సంస్థల్లోనూ తన పట్టును బలోపేతం చేసుకోవాలని భావించడం సహజం. అయితే ఈ క్రమంలో జనసేనకు ఎలాంటి ప్రాధాన్యం దక్కుతుందన్నది కీలకంగా మారింది. రాష్ట్రస్థాయిలో రెండు పార్టీల మధ్య పొత్తు కొనసాగుతున్నా, స్థానిక స్థాయిలో పదవుల పంపకం వచ్చేసరికి ఆశావహుల మధ్య పోటీ సహజంగానే పెరుగుతుంది. జడ్పీ చైర్మన్ పీఠాల విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.మూడు పీఠాలూ టీడీపీకే దక్కితే జనసేనకు ఏం మిగులుతుంది? కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆ పార్టీకి ఇతర స్థానిక సంస్థల పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తారా? లేక జడ్పీ చైర్మన్ పదవుల విషయంలోనూ టీడీపీ నిర్ణయానికే ప్రాధాన్యం ఉంటుందా? అన్న చర్చ మొదలైంది. జనసేనస్త్ర నాయకత్వం ఈ పరిస్థితిని కూటమి ధర్మంలో భాగంగా అంగీకరిస్తుందా? లేక తన పార్టీకి బలమున్న ప్రాంతాల్లో వాటా కోసం పట్టుబడుతుందా? అనేది రాబోయే పరిణామాల్లో తేలాల్సి ఉంది.జనసేనకు జడ్పీ చైర్మన్ పదవులు దక్కకపోయినా, ఇతర స్థానిక సంస్థల పదవులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల పంపకంలో తగిన ప్రాధాన్యం కల్పిస్తే అసంతృప్తిని తగ్గించవచ్చు. అయితే పదవుల పంపకంలో ఒక పార్టీకి అధిక ప్రాధాన్యం లభించి, మరో పార్టీ ఆశలు నెరవేరకపోతే క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం దెబ్బతినకుండా చూడటం రెండు పార్టీల నాయకత్వానికీ అవసరం.మరోవైపు, జడ్పీ చైర్మన్ పదవులు రిజర్వేషన్ల ప్రకారం అర్హులైన అభ్యర్థులకే దక్కాలి. ఆయా జిల్లాల్లో జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు, సభ్యుల బలం, ఎన్నికల అనంతరం ఏర్పడే రాజకీయ సమీకరణాలు తుది నిర్ణయంలో కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల ప్రస్తుత పరిస్థితులు టీడీపీకి అనుకూలంగా కనిపిస్తున్నప్పటికీ, మూడు పీఠాలూ ఆ పార్టీకి ఖరారయ్యాయని చెప్పడానికి అధికారిక నిర్ణయాలు, ఎన్నికల ఫలితాలు అవసరం.మొత్తంగా చూస్తే ఉమ్మడి గుంటూరు ప్రాంతంలో మూడు జడ్పీ చైర్మన్ పీఠాలపైనా టీడీపీ గురిపెట్టినట్లు కనిపిస్తోంది. ప్రస్తుత రాజకీయ వాతావరణం ఆ పార్టీకి అనుకూలంగా ఉందనే అంచనాలు బలపడుతున్నాయి. కానీ ఈ ఆధిపత్యం జనసేనతో సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నదే అసలు ఆసక్తికరమైన అంశం. కూటమిలో టీడీపీ తన ప్రాధాన్యాన్ని నిలబెట్టుకుంటూనే జనసేనకు ఎంత మేరకు అవకాశం కల్పిస్తుంది? జనసేన సర్దుబాటుకు సిద్ధపడుతుందా? లేక తన రాజకీయ వాటా కోసం గట్టిగా నిలబడుతుందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించినప్పుడే మూడు జిల్లాల జడ్పీ రాజకీయాలపై స్పష్టత రానుంది.

ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే మహిళ మృతి

మొదటి పేజీ తరువాయి

నరసరావుపేట రక్షణ న్యూస్...

చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన మహిళ.. ఆపరేషన్ చేయాల్సి ఉండగా ఇంజక్షన్ తీసుకున్న కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయిందన్న ఆరోపణలు నరసరావుపేటలో కలకలం రేపాయి. అంజిరెడ్డి ప్రైవేటు ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈ ఘటనతో మృతురాలి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుటుంబ సభ్యురాలి మృతికి కారణమని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గుంటూరు లక్ష్మీనారాయణమ్మ (55) ముక్కులో కండ పెరిగిన సమస్యతో గత శనివారం అంజిరెడ్డి ఆసుపత్రికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పరీక్షించిన వైద్యులు మంగళవారం ఆపరేషన్ చేస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఆసుపత్రి నర్సు ఆమెకు ఇంజక్షన్ ఇచ్చినట్లు, కొద్దిసేపటికే ఆమె మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు.

ఇంజక్షన్ తర్వాత ఏం జరిగింది?...చికిత్స పొందుతున్న మహిళ అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. వైద్యులు సరైన చికిత్స అందించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. అయితే ఇంజక్షన్‌కు, మహిళ మృతికి మధ్య వైద్యపరమైన సంబంధం ఉందా? మృతికి అసలు కారణమేంటి? చికిత్సలో ఏవైనా లోపాలు జరిగాయా? అనే అంశాలు అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

న్యాయం చేయాలని బంధువుల డిమాండ్..తమ తల్లి మృతిపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ మృతురాలి కుమార్తె, కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వైద్య రికార్డులను పరిశీలించి, మృతికి గల కారణాలను వెల్లడించాలని కోరుతున్నారు. బాధ్యులు ఎవరైనా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఒకవైపు కుటుంబంలో విషాదం.. మరోవైపు మృతికి కారణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ ఘటనపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. బంధువులు చేస్తున్న ఆరోపణలు నిజమా? వైద్యపరంగా ఏం జరిగింది? అన్నది సంబంధిత అధికారులు తేల్చాల్సి ఉంది. మహిళ మృతికి గల అసలు కారణాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

ఆర్నబ్ తో బాపట్ల బీచ్ క్లోజ్

మొదటి పేజీ తరువాయి

రక్షణ న్యూస్ బాపట్ల..

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుఫానుగా మారే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో బాపట్ల జిల్లాలో సముద్ర తీర ప్రాంతాల వద్ద పోలీసులు అప్రమత్తమయ్యారు. అక్టోబర్ 27 నుంచి తదుపరి ఆదేశాలు వెలువడే వరకు జిల్లాలోని బీచ్‌లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ సోమవారం ప్రకటించారు. పర్యాటకులు, సందర్శకులు సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు.తుఫాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున తీర గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు. పోలీసు, రెవెన్యూ అధికారులు సూచించిన విధంగా సురక్షిత ప్రాంతాలకు లేదా ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు.మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే తీరానికి చేరుకోవాలని హెచ్చరించారు. పడవలు, వలలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని తెలిపారు. వరద నీటితో పొంగిపొర్లే వాగులు, వంకలు, కల్వర్టులు, నదులను దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. అక్టోబర్ 27, 28 తేదీల్లో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.ముంపు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన చోట్ల పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలి రహదారులపై పడితే వెంటనే తొలగించేలా అవసరమైన వాహనాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. నీట మునిగిన రహదారుల వద్ద పోలీసు సిబ్బందిని నియమించి రాకపోకలను నియంత్రించాలని, అవసరమైతే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించాలని సూచించారు.అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లు, తాళ్లు వంటి రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని, శిక్షణ పొందిన పోలీసు బృందాలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ సిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అత్యవసర పోలీసు సహాయం కోసం డయల్ 112కు లేదా పోలీసు కంట్రోల్ రూమ్ నంబరు 8333813228కు ఫోన్ చేయాలని, స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/26/2026 11:35 PM Page 3

రామాపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్

చీరాల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ పరిధిలోని ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి రామాపురం గ్రామంలో చీరాల రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో శాంతిభద్రతలను పరిరక్షించడం, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడం, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించడం లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ మోయిన్, చీరాల రూరల్ సీఐ సుధాకర్, ఈపురుపాలెం ఎస్సై రామాంజనేయులు, వేటపాలెం ఎస్సై జనార్ధన్‌తో పాటు సుమారు 100 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో భద్రతా చర్యలను పటిష్టం చేయడంతో పాటు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై పోలీసులు దృష్టి సారించారు.

ఆత్మీయ కార్యకర్తకు కన్నీటి నివాళి

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల పట్టణంలోని రైలుపేటకు చెందిన టీడీపీ కార్యకర్త బిల్లా ప్రదీప్ (టీంకు) మృతి పట్ల బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రదీప్ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ, ప్రదీప్ బిల్లా మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. ప్రదీప్‌తో తనకు ఉన్న అనుబంధం ఈనాటిది కాదని, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే కార్యకర్తగా ఆయనతో ఎంతోకాలంగా పరిచయం ఉందని గుర్తుచేసుకున్నారు. పార్టీ పట్ల అపారమైన అభిమానం, నిబద్ధత కలిగిన ప్రదీప్ తమ మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రదీప్ మృతి ఆయన కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు, పార్టీ శ్రేణులకు తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం ప్రదీప్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

పొన్నూరు పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధం

పొన్నూరు రక్షణ న్యూస్

పొన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డులకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్ బాబు సోమవారం విడుదల చేశారు. ఈ జాబితాను ప్రజలు, ప్రజాప్రతినిధులు పరిశీలించేందుకు వీలుగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం, తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం, పొన్నూరు మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. జాబితాపై ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తెలియజేయాలని కమిషనర్ ఎం. రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు. సంబంధిత వర్గాలు జాబితాను పరిశీలించి, నిర్ణీత గడువులోగా తమ అభ్యంతరాలను తెలియజేయాలని ఆయన సూచించారు.

శ్రీలంకకు మిర్చి ఎగుమతుల నిలిపివేతపై ఎంపీకి వినతి

సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా: లావు శ్రీకృష్ణదేవరాయలు

రక్షణ న్యూస్ -- గుంటూరు:

శ్రీలంకకు ఎర్ర ఎండు మిర్చి ఎగుమతుల నిలిపివేతతో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎగుమతుల రంగంలో నెలకొన్న పరిస్థితులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతినిధుల వినతిపై స్పందించిన ఎంపీ.. సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

తనవంతు సహకారం అందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. భారత ఎర్ర ఎండు మిర్చి ఎగుమతుల రంగంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తదుపరి ప్రకటన వెలువడే వరకు శ్రీలంకకు మిర్చి ఎగుమతులను తాత్కాలికంగా నిలిపివేయాలని అసోసియేషన్ తన సభ్యులకు సూచించింది. ఈ నిర్ణయం ద్వారా ఎగుమతిదారులు, వ్యాపారులు, ఇతర సంబంధిత వర్గాల ప్రయోజనాలను కాపాడటంతో పాటు వాణిజ్య రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భావిస్తున్నట్లు పేర్కొంది. ఎగుమతుల నిలిపివేత కాలంలో శ్రీలంకకు కొత్త ఎగుమతి ఒప్పందాలు చేసుకోవద్దని సభ్యులు, అనుబంధ ఎగుమతిదారులకు సూచించింది. ఇప్పటికే కుదుర్చుకున్న ఒప్పందాలకు సంబంధించిన బాధ్యతలను నిబంధనల ప్రకారం నెరవేర్చాలని స్పష్టం చేసింది. పరిస్థితులను సభ్యులతో సంప్రదించి సమీక్షించిన అనంతరం తదుపరి నిర్ణయాలను అధికారికంగా వెల్లడిస్తామని అసోసియేషన్ తెలిపింది.

రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఎన్నికలు!

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి...ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి విడదల రజని

రక్షణ న్యూస్ -- నరసరావుపేట:

రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సింది పోయి, రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎన్నికలు జరుపుతున్నారని మాజీ మంత్రి విడదల రజని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చిలకలూరిపేట రూరల్ ఎస్సై లేఖా ప్రియాంక తన పట్ల వ్యవహరించిన తీరుపై సోమవారం నరసరావుపేటలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎస్సైపై కేసు నమోదు చేసి, విచారణ జరిపించాలని ఎస్పీ జగదీష్‌ను కోరారు. మూడు రోజుల క్రితం చిలకలూరిపేటలోని తన నివాసం వద్ద ఎస్సై ప్రియాంక దురుసుగా ప్రవర్తించారని రజని తెలిపారు. ఆ సమయంలో జరిగిన ఘటనకు సంబంధించిన ఆధారాలను ఎస్పీకి అందించి వివరించినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని

కోరినట్లు వెల్లడించారు. న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు ఇతర పార్టీల అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నామినేషన్ పత్రాలను చించడం, అభ్యర్థులపై దాడులకు దిగడం, అక్రమ కేసులు పెట్టడం, గ్రామాలు విడిచి వెళ్లేలా భయపెట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. చిలకలూరిపేటలో అర్ధరాత్రి వరకు అధికార పార్టీ నేతలు, అధికారులు కలిసి ఇతర పార్టీల అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చి నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపించారు. చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థి భర్తను కిడ్నాప్ చేసి, భయభ్రాంతులకు గురిచేసి పార్టీ మారేలా చేశారని రజని ఆరోపించారు. వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను కూడా నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు టీడీపీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు. ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థులకు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితులు ఉండాలని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడం వల్లే వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పల్నాడులో ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆయుధాలు.. సాంకేతిక పరికరాల ప్రదర్శన

పోలీస్ ఓపెన్ హౌస్‌కు విద్యార్థుల సందడి

రక్షణ న్యూస్ -- బాపట్ల

పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, నేర పరిశోధనలో ఉపయోగించే సాధనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బాపట్లలో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కాపు కల్యాణ మండపంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ప్రారంభించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు విధుల్లో ఉపయోగించే ఆయుధాలు, మ్యాన్‌ప్యాక్ సెట్లు, వేలిముద్రల సేకరణ పరికరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, డ్రోన్లు, లాక్డ్ హౌస్

మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) కెమెరాల పనితీరును ఎస్పీ విద్యార్థులకు వివరించారు. నేర పరిశోధనలో క్లూస్ టీమ్ పరికరాలు, పోలీసు జాగిలాల సేవలు ఎలా ఉపయోగపడతాయో తెలియజేశారు. పోలీసు జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు, పోలీసు శాఖకు మధ్య సత్సంబంధాలు పెంపొందించడం, అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పోలీసు శాఖలో ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు, బాలబాలికలకు ఆపద ఎదురైనప్పుడు శక్తి బృందాలు అందించే సేవలు, శక్తి యాప్ ఉపయోగాలను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపారు. పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల కుటుంబాలను పరామర్శించడం, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు. జిల్లాలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలు, అమరవీరుల కుటుంబాలు, ప్రజల కోసం వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సీహెచ్ చంద్రమౌళి, ఏఆర్ డీఎస్పీ పి. కృష్ణంరాజు, బాపట్ల టౌన్, రూరల్ సీఐలు రాంబాబు, సుబ్బారావు, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, హోంగార్డు ఆర్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ధర్నా.. ఆరుగురికి నోటీసులు

రక్షణ న్యూస్ -- యడ్లపాడు:

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించిన ఘటనపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఆందోళనలో పాల్గొన్న వారిలో గతంలో కేసులు నమోదైన ఆరుగురికి సంజాయిషీ నోటీసులు జారీ చేయనున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. ఎస్సై శివరామకృష్ణ అందించిన సమాచారం మేరకు ఈ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే

చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి గరిష్ఠంగా రూ.5 లక్షల జరిమానా, ఏడాది వరకు జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. నోటీసులకు సంబంధిత వ్యక్తులు ఇచ్చే వివరణను పరిశీలించిన అనంతరం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ నుంచి కౌంటింగ్ వరకు పక్కాగా ఏర్పాట్లు

రక్షణ న్యూస్ -- గుంటూరు:

గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడంతో పాటు, అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాల పరిశీలన, ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు.ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు అక్టోబరు 27, 28 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేయడానికి వచ్చే సిబ్బంది ఓటరు గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఓటింగ్ గోప్యత కోసం ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు, వీడియోగ్రఫీ, హెల్ప్‌డెస్క్ సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. పత్రాల ధ్రువీకరణకు గెజిటెడ్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఖర్చుల వివరాలు నమోదు చేయాలి

నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి రోజువారీ ఎన్నికల వ్యయ వివరాలను పక్కాగా నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. సంబంధిత బిల్లులు, వోచర్లు, రసీదులతో కూడిన ప్రొఫార్మా-II, ప్రొఫార్మా-III, రికార్డులను ప్రతి మూడు రోజులకు ఒకసారి పరిశీలనకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా తొలి పరిశీలన అక్టోబరు 27న, రెండో పరిశీలన అక్టోబరు 30న ఉదయం 10 గంటలకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అభ్యర్థులు లేదా వారి అధీకృత ఎన్నికల ఏజెంట్లు నిర్ణీత తేదీల్లో హాజరై ఖర్చుల వివరాలు, ఆధార పత్రాలను సమర్పించి రసీదు పొందాలని సూచించారు. వ్యయ ఖాతాలను సక్రమంగా నిర్వహించకపోయినా, నిర్ణీత గడువులోగా సమర్పించకపోయినా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1955లోని సెక్షన్ 20బీ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా మార్గదర్శకాలు జారీ చేశారు.

నవంబరు 3న ఓట్ల లెక్కింపు

గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబరు 3న జరగనున్న నేపథ్యంలో కౌంటింగ్ సిబ్బంది ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని కమిషనర్ ఆదేశించారు. స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, సంబంధిత అధికారులకు సోమవారం ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.చెల్లుబాటయ్యే, చెల్లుబాటు కాని ఓట్లను గుర్తించే విషయంలో సిబ్బందికి పూర్తి స్పష్టత ఉండాలని కమిషనర్ సూచించారు. ఏవైనా సందేహాలు తలెత్తితే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు లెక్కింపు ప్రక్రియ స్పష్టంగా కనిపించేలా వ్యవహరించాలని, అనవసర వివాదాలకు తావివ్వకూడదని తెలిపారు. ప్రతి రౌండ్ ముగిసిన వెంటనే ఓట్ల వివరాలను నిర్ణీత ఫారాల్లో తప్పుల్లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.కౌంటింగ్ సిబ్బంది నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని, భద్రతా నిబంధనల ప్రకారం కౌంటింగ్ హాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివ రావు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

27, 28 తేదీల్లో పాఠశాలలకు సెలవులు...

నిజాంపట్నం రక్షణ న్యూస్

తుఫాను ప్రభావం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం నిజాంపట్నం మండలం హర్బేపేట పంచాయతీలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన, తుఫాను పరిస్థితుల దృష్ట్యా ఈ నెల 27, 28 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని రేపల్లె ఆర్డీవో శ్రీదేవికి ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు రెండు రోజులకు సరిపడా సరుకులను ముందుగానే అందజేసి, అనంతరం సెలవులు ప్రకటించాలని సూచించారు. తుఫాను ప్రభావంతో

విద్యార్థులు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పర్యటనలో భాగంగా స్థానిక గ్రామస్తులతో మాట్లాడిన కలెక్టర్, గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తాగునీటి కొరత, విద్యుత్ సమస్యలతో పాటు రేషన్ సరుకుల పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ప్రతి నెల ఒకటో తేదీన మాత్రమే రేషన్ సరుకులు అందిస్తున్నారని, ఆ తర్వాతి రోజుల్లో సరుకులు పంపిణీ చేయడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.గ్రామస్తులు తెలిపిన సమస్యలపై కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ వెంటనే స్పందించారు. తాగునీరు, విద్యుత్, రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించిన శాఖల అధికారులతో మాట్లాడి, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామస్తుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు.

“రెండేళ్ల అభివృద్ధి కనిపించడం లేదా”..?

ఆమంచిపై ఎమ్మెల్యే మాలకొండయ్య ఫైర్..

చీరాల రక్షణ న్యూస్

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత ఆమంచి కృష్ణమోహన్ వ్యాఖ్యలపై చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య తీవ్రస్థాయిలో స్పందించారు. రాజకీయ లబ్ధి కోసం ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఓట్ల కోసం నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.చీరాలకు రావాల్సిన మెడికల్ హాస్పిటల్‌ను వెనక్కి పంపించారని, వ్యాన్‌పిక్ భూముల వ్యవహారంలో అవినీతికి పాల్పడ్డారని ఆమంచిపై మాలకొండయ్య ఆరోపణలు గుప్పించారు. గతంలో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని, ఇతరులపై విమర్శలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని హితవు పలికారు.చీరాల నియోజకవర్గంలో గత రెండేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గమనించాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనులను పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని, వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని ఆమంచికి సూచించారు.స్థానిక రాజకీయాల్లో అభివృద్ధి, గత పాలనకు సంబంధించిన అంశాలపై అధికార, ప్రతిపక్ష నేతల మధ్య విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో మాలకొండయ్య వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి

టీడీపీ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసిన నక్కా ఆనందబాబు

తెనాలి రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. తెనాలి పట్టణంలోని వేమూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం చుండూరు, భట్టిప్రోలు మండలాలకు చెందిన టీడీపీ అభ్యర్థులకు ఆయన బి-ఫారాలు అందజేశారు.ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన తదుపరి కార్యక్రమాలను అభ్యర్థులు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర అవగాహనతో, ఐకమత్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని మూడు పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని అన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా జనసేన పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎంపీటీసీ అభ్యర్థులకు టీడీపీ శ్రేణులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కూటమి ఐక్యతను చాటుతూ అన్ని స్థానాల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో చుండూరు, భట్టిప్రోలు మండలాలకు చెందిన అభ్యర్థులు, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల వేళ టీడీపీలోకి ఐదు కుటుంబాలు

పొన్నూరు రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల వేళ పొన్నూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి రాజకీయంగా సానుకూల పరిణామం చోటుచేసుకుంది. పొన్నూరు మండలం ఉప్పరపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదు కుటుంబాలు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సమక్షంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ చేరిక స్థానికంగా టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయా కుటుంబాల సభ్యులు వెల్లడించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న ఆదరణకు ఈ చేరికలు నిదర్శనమని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ఈ పరిణామం దోహదపడనుంది. స్థానికంగా వైఎస్సార్‌సీపీకి చెందిన కుటుంబాలు టీడీపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

సమాజానికి వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయులు

బాపట్ల రక్షణ న్యూస్

భారత సమాజాన్ని సన్మార్గంలో నడిపించిన మహర్షి వాల్మీకి ఆదర్శప్రాయులని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అన్నారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించే రామాయణాన్ని పిల్లలకు మంచి కథల రూపంలో తెలియజేయాలని సూచించారు. సంస్కృతంలో 24 వేల శ్లోకాలతో రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. దేశ చరిత్ర, మహనీయుల జీవిత చరిత్రలు, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన కావ్యాలను చదవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.జిల్లా రెవెన్యూ అధికారి లవన్న మాట్లాడుతూ, ఇతరులకు హాని చేయకుండా మేలు చేయాలనే దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. జ్ఞానోదయంతో బోయవాడి నుంచి మహర్షిగా ఎదిగిన వాల్మీకి సత్యం, ప్రేమ, దైవత్వాన్ని ప్రతిబింబించే కావ్యాలను రచించి దేశానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ బి. సింగయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దులూరి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్న 20 కుటుంబాలు

చీరాల రక్షణ న్యూస్

చీరాల నియోజకవర్గంలో రామన్నపేటకు చెందిన 20 యానాది కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. చీరాల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పోలకం శేఖర్ ఆధ్వర్యంలో, యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటగిరి సంజీవరావు నాయకత్వంలో ఈ చేరికలు జరిగాయి.ఈ సందర్భంగా చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య నూతనంగా పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో చీరాల యువ నాయకుడు మద్దులూరి గౌరీ అమర్నాథ్, వేటపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు వీరాంజనేయులు, రామన్నపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉమ్మటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/26/2026 11:35 PM Page 5

లక్ష్మీ సరోజ దంపతులకు కన్నా, అరవిందబాబు అభినందనలు

రక్షణ న్యూస్ -- నరసరావుపేట: పల్నాడు జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి రేసులో ఉన్న నకరికల్లు జెడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నాగోతు వెంకట లక్ష్మీ సరోజ, డాక్టర్ రంజిత్‌కుమార్ దంపతులను ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, చదలవాడ అరవిందబాబు అభినందించారు. సోమవారం నరసరావుపేటలోని వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగోతు సౌరయ్య, వి.వి.నరసయ్య, వాసిరెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో నక్కల లక్ష్మి

కర్లపాలెం రక్షణ న్యూస్ కర్లపాలెం జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అభ్యర్థి నక్కల లక్ష్మి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత కట్టావారిపాలెం గ్రామంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం గ్రామంలో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలను కలుసుకుంటూ, తన అభ్యర్థిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆమెకు తోడుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ బాజీతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం.. పాత కక్షలతో హత్య

ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం..ముగ్గురు నిందితుల అరెస్టు

రక్షణ న్యూస్ -- నరసరావుపేట: పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామ శివారులో జరిగిన షేక్ సైదా (30) హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం, పాత కక్షల నేపథ్యంలో అతడిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైందని గురజాల డీఎస్పీ మహేశ్వరరావు తెలిపారు. ఈ కేసులో గ్రామానికి చెందిన కర్నూరపు మణికంఠ అలియాస్ బాబు (28), షేక్ నాగూర్‌వలి (19), షేక్ ముస్తఫా (19)లను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సోమవారం దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. సైదాకు మొదటి నిందితుడు మణికంఠ సోదరితో వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో వివాదాలు తలెత్తడంతో మణికంఠ అతడిపై కక్ష పెంచుకున్నట్లు తెలిపారు. సైదా భార్య అస్మా మరణం విషయంలోనూ సైదాపై అనుమానం ఉండటంతో మరో నిందితుడు నాగూర్‌వలి అతడిపై కక్ష పెంచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 19, 20 తేదీల మధ్య అర్ధరాత్రి సుమారు 2.30 గంటలకు గ్రామంలోని అంకాలమ్మ దేవాలయం సమీపంలో ముగ్గురు నిందితులు సైదాపై దాడి చేసి గొంతు నులిమి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని హోండా షైన్ ద్విచక్ర వాహనంపై మారాజు సుబ్బారావుకు చెందిన పత్తి పొలానికి తరలించి, అక్కడ చెట్టుకు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడించారు. ఈ నెల 20న సైదా తండ్రి తన కుమారుడి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదహళ్లి ఆదేశాల మేరకు గురజాల డీఎస్పీ మహేశ్వరరావు పర్యవేక్షణలో దాచేపల్లి సీఐ ఖాజావలి, పోలీసు సిబ్బంది విచారణ చేపట్టారు. నేరస్థలంలో భౌతిక ఆధారాలను సేకరించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుల పాత్రను గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 26న గ్రామ రెవెన్యూ అధికారి సమక్షంలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబరు 209/2026గా కేసు నమోదు చేసి, భారతీయ న్యాయ సంహితలోని 103(1), 61(2), 238, 3(5) సెక్షన్ల కింద దర్యాప్తు చేపట్టారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీ మహేశ్వరరావు, సీఐ ఖాజావలి, ఎస్సై, పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదహళ్లి అభినందించారు.

పోలీసు ఆయుధాలు.. ఆధునిక సాంకేతికతపై అవగాహన

ఓపెన్ హౌస్ కార్యక్రమానికి 950 మంది విద్యార్థులు

రక్షణ న్యూస్ -- నరసరావుపేట: పోలీసు శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరికరాలు, నేర పరిశోధన విధానాలను విద్యార్థులకు పరిచయం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం నరసరావుపేటలోని జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదహళ్లి ఐపీఎస్ రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 950 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విధుల్లో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, స్వల్ప, దీర్ఘ దూర లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు, గుంపుల నియంత్రణకు వినియోగించే పరికరాలు, పొగ ప్రయోగ సాధనాలు, డ్రోన్ కెమెరాలను ప్రదర్శించారు. వాటి పనితీరును అధికారులు వివరించారు. ఆయుధాలను దగ్గరగా పరిశీలించిన విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. బాంబు నిర్వీర్య దళం, పోలీసు శునకాల దళం, నేర పరిశోధనలో ఉపయోగించే శాస్త్రీయ పరికరాలు, ట్రాఫిక్ పోలీసుల సాధనాలు, లోహ గుర్తింపు యంత్రాలు, రక్షణ హెల్మెట్లు, లాఠీలు, అల్లర్ల నియంత్రణ పరికరాలను ప్రదర్శించారు. వజ్ర వాహనం, మహిళా పోలీసు స్టేషన్ ప్రత్యేక దర్యాప్తు వాహనం, సంచార నేర పరిశోధన ప్రయోగశాల, రక్షక్ వాహనాల పనితీరును విద్యార్థులకు వివరించారు .నేరాల నియంత్రణ, పరిశోధన, ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎలా ఉపయోగపడుతుందో తెలియజేశారు. వైర్‌లెస్ సెట్లు, సమాచార ప్రసార పరికరాలు, పోలీసు శాఖలోని వివిధ విభాగాల విధులను వివరించారు. పోలీసుల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడం, విద్యార్థుల్లో పోలీసు విధులపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమ లక్ష్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, వేలిముద్రల విభాగం ఇన్‌స్పెక్టర్ బి.పణి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.కృష్ణ, గోపీనాథ్, యువరాజు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

బాపట్ల రక్షణ న్యూస్ జిల్లాలో తుఫాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాలులో తుఫాను ముందస్తు చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సముద్ర తీరప్రాంత గ్రామాలు, కృష్ణా నది, కాలువల సమీపంలోని ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చూడాలని, ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారిని తిరిగి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, బాధితులకు భోజనం, తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. డ్రైన్లలో నీరు సజావుగా ప్రవహించేలా చూడాలని, అవసరమైన చోట్ల జేసీబీలు, రవాణా వాహనాలను సి ద్ధంగా ఉంచాలని సూ చించారు. తుఫాను నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని, వసతి గృహాల విద్యార్థులను సురక్షితంగా ఇళ్లకు పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. గర్భిణులను గుర్తించి, త్వరలో ప్రసవం అయ్యే అవకాశం ఉన్నవారిని ముందుగానే సురక్షిత ఆసుపత్రులకు తరలించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పూరిగుడిసెల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 84 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఏడు డ్రైన్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతతో పనిచేస్తూ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో లవన్న, డీఎఫ్‌వో సౌజన్య, జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, బాపట్ల ఆర్డీవో హరికుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, డీఈవో శ్రీనివాస్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి లక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.230 కోట్లతో ఇంటింటికీ తాగునీరు

ఏడాదిలోగా పనులు పూర్తి చేస్తాం

వినుకొండ అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలి: ఎంపీ లావు

రక్షణ న్యూస్ -- వినుకొండ: వినుకొండ పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.230 కోట్లకు పైగా నిధులతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించే పనులు చేపడుతున్నామని, ఏడాదిలోగా వాటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు .2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులు, తనపై ప్రజలు చూపిన ఆదరణను గుర్తుచేస్తూ.. అదే మద్దతును స్థానిక ఎన్నికల్లోనూ కొనసాగించాలని కోరారు. వినుకొండ నుంచి గుంటూరు వరకు జాతీయ రహదారి మంజూరైం దని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. అర్హులకు నెలకు రూ.4 వేల పింఛను, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, స్త్రీనిధి వంటి కార్యక్రమాలను ప్రస్తావిం చారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం, సామాజిక సామరస్య పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు .సమావేశంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నలబోలు విష్ణు తదితర నాయకులు ప్రసంగించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా షమీమ్ ఖాన్, వైస్ చైర్మన్ అభ్యర్థిగా పెనుగొండ శ్రీనివాసరావును పరిచయం చేశారు. 16వ వార్డుకు గణేష్, 17వ వార్డుకు కోటా స్రవంతి, 18వ వార్డుకు అజీజ్, 19వ వార్డుకు అమరా శ్రీనివాసరా వు, 20వ వార్డుకు షేక్ షర్మిలను అభ్యర్థులుగా ప్రకటించారు. మసీదు ప్రారంభోత్సవానికి సంబంధించిన వివాదం సమయంలో షమీ మ్ ఖాన్ ముస్లిం సోదరులతో చర్చించి సమస్య పరి ష్కారానికి కృషి చేశారని ఎంపీ ప్రశంసించారు. వినుకొండ అభివృద్ధి కొనసాగాలంటే స్థానిక సం స్థల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

బాపట్ల--విశాఖ మధ్య అర్నబ్ తీరం దాటే అవకాశం

మొదటి పేజీ తరువాయి

రక్షణ న్యూస్ -- బాపట్ల, అక్టోబరు 26: బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరంవైపు కదులుతోంది. ఈ నెల 28వ తేదీ ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించింది. తుపాను ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో బాపట్ల జిల్లా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. తుపాను పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నెల 27, 28 తేదీల్లో కోస్తాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదముంది. బలమైన గాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలు అవసరం.

తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

బాపట్ల జిల్లాలోని సముద్ర తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు తీరానికి చేరుకోవాలని సూచిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున తీర ప్రాంతాల్లోని ప్రజలు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పంటల రక్షణపై రైతుల దృష్టి...తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, కోసిన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలి